
కథ

# టి.వి. చేసిన పాపం

● ఎ. ఉమాశంకర్




ఆ రోజు యమలోకం మహారద్దీగా ఉంది. అందుకు కారణం ఆరోజు భూలోకంలో భూకంపం వచ్చి వేలాది మంది చనిపోయారు. వాళ్లందరి పాపపుణ్యాలు పరిశీలించి శిక్షలు విధించే పనిలో చిత్రగుప్తుడు, యమధర్మరాజు బిజీగా ఉన్నారు. అందరికీ శిక్షలు విధించి చాలా అలసిపోయారు. అలాంటి సమయంలో ఒక స్త్రీ, ఒక బాలుడు, ఇద్దరు పురుషులు వచ్చారు. యముడు, చిత్రగుప్తుడి వంక ప్రశ్నార్థకంగా చూశారు.

అప్పుడు చిత్రగుప్తుడు "ప్రభూ, ఈమె పేరు సుమతి. 'పతియే ప్రత్యక్షదైవం' అని పెళ్లికి ముందు భావించి, పెళ్లి అయిన తర్వాత భర్త గురించి పట్టించుకోకుండా టి.వి. ముందు కూర్చుని ఇరవైనాలుగ్గంటలు సినిమాలు, సీరియల్స్ చూసేది. భర్త ఎన్ని జాగ్రత్తలు చెప్పినా టి.వి.కి బాగా దగ్గర కూర్చుని చూడడం మానలేదు. దానితో ఈమెకు చత్వారం వచ్చి కళ్లజోడు చేరింది. కరంటు బిల్లు ఎక్కువ వచ్చి పాపం మేడలో వుండేవాళ్లు పాకలోకి వచ్చారు" అని చెప్పినాడు. దానినంతా యమధర్మరాజు సావధానంగా విని, ఈమెకు పంచభక్ష్య పరమాన్నాలతో రోజూ విందు చేయండి. కాని వినోదానికి ఒక్క వస్తువు కూడా ఇవ్వవద్దు అని చెప్పాడు.

అది విని సుమతి భోరున ఏడుస్తూ, "యమధర్మరాజా! నాకు ఏమీ వద్దు.... ఒక టి.వి. ఇప్పించండి. నాకు టి.వి. సీరియల్స్ చూడకపోతే పిచ్చెక్కిపోతుంది. ఇంత కఠిన శిక్ష వేయటం ఏమీ బాగాలేదు" అని అంది. కాని యమధర్మరాజు ఆమె చెప్పింది వినిపించుకోకుండా భటుల కిచ్చి పంపించాడు. ఆమె భోరుమని ఏడుస్తూ గింజుకుంటూ వెళ్లిపోయింది.

తర్వాత పిల్లవాడి వంతు వచ్చింది. చిత్రగుప్తుడు పిల్లవాడ్ని చూపిస్తూ "వీడు చదువుకోకుండా, తండ్రి చెప్పిన మాట వినకుండా ఎప్పుడూ టి.వి. సీరియల్స్ చూసి, అందులో చూపించినట్లుగా దొంగతనాలు చేస్తూ చివరకు హత్య చేసి, పోలీసులను చూసి దొరక్కకుండా పారిపోతూ లారీని గుద్దుకుని చచ్చిపోయాడు"అని విన్నవించెను.

వెంటనే యమధర్మరాజు పిల్లవాడితో "ఏమిరా నీవు ఇంత చిన్నవయసులోనే ఇలా తయారయ్యావు. నీకు బుద్ధి లేదా" అని ప్రశ్నించాడు. అందుకు పిల్లవాడు "చదువుకుని చేసేదేముంది. టి.వి.లో చూపించినట్లుగా చేస్తే బోల్డు డబ్బు వస్తుంది" అని సమాధానం ఇచ్చాడు. అప్పుడు యమధర్మరాజు వీడిని తీసుకెళ్లి చిన్న గదిలో ఉంచండి. చదువుకోవడానికి బోల్డు పుస్తకాలు ఇవ్వండి. చదవకపోతే సూదులతో గుచ్చండి. ఇదే వీడికి సరైన శిక్ష" అని చెప్పి భటులకిచ్చి పంపివేశాడు.

మిగిలిన ఇద్దరు పురుషులలో ఒకడు ముందుకు వచ్చాడు. అతని వయస్సు సుమారు 40 నుండి 45 సంవత్సరాల మధ్య ఉంటుంది. వాడిని చూపిస్తూ వీడు చేసిన నేరం ఏమిటి

అని చిత్రగుప్తుడిని అడిగాడు. అప్పుడు చిత్రగుప్తుడు "ప్రభూ! ఇతడు భూలోకంలో ఒకనొక ప్రదేశంలో వినోదశాల (సినిమా) ఏర్పాటు చేశాడు. వినోదశాల చాటున ఇతడు ఇతరులకు అమ్మాయిలను అందచేస్తూ, వారిచేత వ్యభిచారం చేయించి, వారితోపాటు వీడుకూడా వ్యభిచరించేవాడు. అది చూసి వీడి భార్య వీడిని మందలించింది. 'ఎయిడ్స్' వంటి భయంకర వ్యాధులు వస్తాయి. అందుకని మానెయ్యండి అని నచ్చజెప్పింది. వీడు వినకుండా అనేక జబ్బులు తెచ్చుకుని, ఇంకా అనేకమంది యువతులకు ఈ జబ్బులు అంటించి సమాజాన్ని పాడుచేశాడు. గౌరవంగా బతుకుతున్న వీడి భార్యకు కూడా జబ్బులు వచ్చాయి. అది భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. పెళ్లాం చావుకి పరోక్షంగా కారకుడయ్యి, కంటికి కనిపించిన అందమైన అమ్మాయిని అనుభవించేదాకా వదిలేవాడుకాదు. దానితో తన జీవితాన్నే కాకుండా ఇతరుల జీవితాన్ని కూడా పాడుచేశాడు" అని అతని పాపాల చిట్టా చదివి చెప్పాడు.

అంతావిని యమధర్మరాజు "ఓరి పాపీ! నీ భార్య నీకు ఎంత చెప్పినా వినకుండా ఇంకా పాపాలు చేశావు. నీ భార్య చేసిన పుణ్యం నిన్ను కొంతవరకు కాపాడుతుంది కాని శిక్ష అనుభవించక తప్పదు" అని చెప్పి భటులతో "వీడిని తీసుకెళ్లి స్వర్గద్వారానికి ఎదురుగా ఉన్న గదిలో కూర్చోబెట్టండి. రోజుకొక అందమైన అమ్మాయిని ఇతని గదిలోనికి తీసుకురండి. కాని వీడు ఏమి చేయకుండా కాళ్లు, చేతులు కట్టేయండి. అదే వీడికి తగిన శిక్ష" అని చెప్పి పంపివేశాడు.

చివరకు సుమారు 30 సంవత్సరాలు గల యువకుడు మిగిలాడు. "వీడు చేసిన నేరం ఏమిటి? అని అడిగాడు. చిత్రగుప్తుడు "వీడు దొంగతనాలు చేశాడు" అని చెపుతుండగా, యమధర్మరాజు పూర్తిగా వినకుండా "వీడిని సల సల కాగే నూనెలో వేయండి" అని భటులను ఆజ్ఞాపించి ఆసనం నుండి లేవబోయాడు.

అప్పుడు ఆ యువకుడు యమధర్మరాజుతో "యమా! నాగురించి పూర్తిగా వినకుండా శిక్ష వేయడం న్యాయంగా లేదు. నువ్వు ఇలాగా చేస్తే పుణ్యాలు చేసినవాళ్లు కూడా ఇక్కడకే వస్తారు. దానితో స్వర్గానికి, నరకానికి తేడా ఉండదు. కాబట్టి నేను చెప్పేది సావధానంగా విని అప్పుడు శిక్ష వేయండి. నాకు అభ్యంతరం లేదు" అని చెప్పాడు.

అప్పుడు ఆ యువకుడు "నా పేరు కృష్ణ. నేను వ్యాపారం చేసుకుని న్యాయంగా జీవించేవాడిని. ఉన్నదానితో సంతృప్తి పడేవాడ్ని. నాకు పెళ్లి అయింది. పెళ్లి అయిన కొన్ని రోజుల తరువాత నా భార్య నన్ను పట్టించుకోవడం మానేసింది. అందుకు కారణం కనుక్కుంటే పక్క ఇంటిలోకి టి.వి. చూడటానికి వెళ్లిపోతుంది. దానితో నా భార్య అక్కడ వెళ్లకుండా సెకండ్ హాండ్ టి.వి. కొన్నాను. దాంతో నా భార్య ఇంతకు ముందు కొంచెమైన పట్టించుకునేది కాని టీవీ కొన్నాక అసలు పట్టించుకోవడం లేదు. పైగా టి.వి.లో సీరియల్స్ గురించి, కథల గురించి అందులో నటీనటుల గురించి చెప్పి నా బుర్ర పాడు చేసేది. ఇరవై నాలుగ్గంటలూ టి.వి. చూసేది. దానితో ఎప్పుడూ తక్కువ మొత్తంలో వచ్చే కరంటు బిల్లు ఎక్కువగా వచ్చింది. నా భార్య నా గురించి ఆలోచించాలంటే టి.వి. లేకుండా చేయడమే మార్గం అని ఆమెకు తెలియకుండా ఒకరోజు దాన్ని అమ్మివేశాను. అయినా నాభార్య ఎదురింటికి పక్కిళ్లకి వెళ్లి చూసి వచ్చేది. ఆ ఇళ్ళల్లో పరిస్థితి కుడా నాలాగా ఉందని తెలుసుకున్నాను. దానితో మా వీధిలో ఉన్న టి.వి.లను మాత్రమే దొంగతనం చేసి, మాగ్రామంలో అసలు టి.వి. లేకుండా చేసి కాపురాలు బాగు చేశాను. దొంగతనం చేసిన టి.వి.లను అమ్మి వచ్చిన సొమ్మును గుడిలో అన్నదానాలకు ఖర్చు చేశాను. చివరకు ఒకచోట టి.వి. దొంగిలిస్తుంటే ఒకరు చూసి పట్టుకోవటానికి ప్రయత్నించారు. దానితో నేను దొరక్కుండా తప్పించుకుపోతూ చూసుకోకుండా లారీని గుద్దుకుని చచ్చిపోయాను. ఇదీ జరిగింది. మీరు బాగా ఆలోచించండి. నేను ఇంకా భూలోకంలోనే ఉండాలి. కాని అనవసరంగా చచ్చిపోయి ఇక్కడకు వచ్చాను. అక్కడ(భూలోకంలో) నా భార్య నా గురించి ఏమి చేస్తుందో తెలియదు. కాబట్టి నేను మరల భూలోకం వెళ్లిపోతాను. నన్ను తిరిగి పంపించండి" అని కోరాడు.

అందుకు యమధర్మరాజు "నీ గురించి పూర్తిగా వినకుండా శిక్ష వేసినందుకు ఏమీ అనుకోవద్దు. నిన్ను భూలోకం తిరిగి పంపించడం కుదరదు. నీకు తెలియని ఒక విషయం చెపుతాను. నీవు అనుకుంటున్నట్లుగా నీవు చనిపోయి ఒక రోజు కాదు. ఒక సంవత్సరం గడిచిపోయింది. నీ భార్య నీ గురించి పట్టించుకోకుండా నీవు దాచిన డబ్బుతో మరలా టి.వి. కొనుక్కుని సీరియల్స్ అవీ చూస్తూ ఆనందంగా ఉంది. నీవు తిరిగి వెళ్లినా పట్టించుకోదు. టి.వి. ఉన్నంతకాలం ఎవరూ మారరు. అందువలన నీవు భూలోకం వెళ్లేలా చేయలేను. హాయిగా స్వర్గంలో ఉండి స్వర్గసుఖాలు అనుభవించు లేదా, నాకు సలహాదారుగా ఉండు" అని చెప్పాడు.

అప్పుడు ఆ యువకుడు భూలోకంలో జరుగుతున్న తతంగాన్ని చూసి తిరిగి తన ఇంటికి వెళ్లే ఆలోచన విరమించుకుని యమధర్మరాజుకి సలహాదారుడిగా ఉండటానికి నిశ్చయించుకున్నాడు. ■

